
భారత అమెరికా అణు ఒప్పందాన్ని అనేక రాజకీయ పక్షాలూ ఆలోచనాపరులూ వ్యతిరేకిస్తున్నారు. వామపక్ష పార్టీలైతే కేంద్ర ప్రభుత్వాన్ని సంక్షోభంలో పడేయడానికి కూడా వెనుకాడడం లేదు. ఆ ఒప్పందం చాలా ముఖ్యమైనదని మన్మోహన్‌సింగ్ స్వయంగా అంటున్నప్పుడు దానిగురించి కనీసం పార్లమెంటులో సమగ్రమైన చర్చ జరగకుండా సంతకం చేయడం న్యాయం కాదనీ, ఆ చర్చ జరిగేదాకా దాని అమలును ఆపమనీ వామపక్ష పార్టీలు అంటున్నాయని మీకందరికీ అర్థమయ్యే ఉంటుంది. చాలామందికి ఈ మేరకు అంగీకారమూ ఉంటుంది. పార్లమెంటు ఆమోదించని ఒప్పందానికి చట్టబద్ధత లేదని రిటైర్డ్ సుప్రీంకోర్టు జడ్జి జీవన్‌రెడ్డిగారు రాజ్యాంగాన్ని విశ్లేషించి వ్యాఖ్యానిస్తున్నారు. అయితే కేవలం చర్చ జరగకుండా సంతకం చేయడమేమిటి అన్న అభ్యంతరమేకాక ఒప్పందం నైజానికి సంబంధించిన అభ్యంతరాలూ వామపక్ష పార్టీలు వ్యక్తం చేస్తున్నాయి. భారతీయ జనతాపార్టీ కూటమీ వ్యక్తం చేస్తున్నది. చాలామంది విశ్లేషకులూ, శాస్త్రవేత్తలూ కూడా వ్యక్తం చేస్తున్నారు.

భారత పాలకులు ఏ లక్ష్యం కోసమైతే ఈ ఒప్పందానికి ఒడిగట్టారో ఆ లక్ష్యం సమర్థంగా నెరవేరదన్నది ఎక్కువమంది అభ్యంతరం. అణుశాస్త్ర నిపుణులూ భారతీయ జనతాపార్టీ కూటమీ ఈ కోణం నుండే దీనికి అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఆ లక్ష్యమే సమర్థనీయం కాదనేది మరొక అభ్యంతరం. వామపక్ష కూటమి విమర్శలో కొంచెం అదీ కొంచెం ఇదీ ఉన్నాయంటే వారు ఆక్షేపించరని ఆశిస్తాం.

అణ్వాయుధాలు తయారు చేసుకునే సామర్థ్యం తమ దగ్గరే ఆగిపోవాలనేది మొట్టమొదట అణుబాంబులు తయారు చేసుకున్న అగ్రరాజ్యాల వైఖరి. అందరి కంటే మొదట తయారు చేసింది, మొదట ప్రయోగించింది అమెరికా అన్నది తెలిసిన విషయమే. రెండవ ప్రపంచయుద్ధం చివరి దశలో అమెరికా అణుబాంబు తయారు చేసుకుంది. చివరిఘట్టంగా జపాన్‌లోని హిరోషిమా, నాగసాకి నగరాలపైన ప్రయోగించి మూడున్నర లక్షల మందిని చంపి ఇంకెంతో మందిని వికలాంగులను చేసింది. యుద్ధంలో ఇంకా ఎక్కువ మంది చావకుండా త్వరగా యుద్ధాన్ని ముగించడానికి ఇది తప్పనిసరి అయిందని అమెరికా ఆనాడు దబాయించి నప్పటికీ, అది నిజం

# 123 ఒప్పందాన్ని ఏ విధంగా అర్థం



కాదని చరిత్ర పరిశోధకులు చెప్తున్నారు. హిరోషిమా, నాగసాకిల పైన అణుబాంబు వేయకున్నా జపాన్ లొంగిపోయేదే. యుద్ధానంతరం నెలకొన బోతున్న కొత్త సమీకరణలలో తన సత్తాను చాటుకోవడం కోసమే ఆ రెండు నగరాల పైన అమెరికా అణుబాంబు వేసింది.

త్వరలోనే మరికొన్ని పారిశ్రామిక దేశాలు కూడా అణుబాంబును తయారు చేసుకున్నాయి. ఈ అణ్వస్త్ర దేశాలు అణ్వస్త్ర సామర్థ్యం తమ దగ్గరే ఆగిపోవాలని భావించి ఇతర దేశాలపైన ఒత్తిడి పెట్టసాగాయి. అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం (ఎన్‌పిటి) రూపొందించి, ప్రపంచ దేశాలన్నీ దానిపైన సంతకం చేయాలని ఒత్తిడి పెట్టాయి. ఇండియా పెట్టడానికి నిరాకరించింది. మాకు అణుబాంబు తయారుచేసే ఉద్దేశం లేదుగానీ, మీ దగ్గర పుష్కలంగా బాంబులు పెట్టుకొని వేరే ఎవ్వరూ తయారు చేయొద్దని ఒట్టు పెట్టించుకోవడం ఏమిటని మన పాలకులప్పుడు అన్నారు. మనం బాంబు తయారు చేసుకోనంతకాలం ఈ అభ్యంతరంలోని నైతికత అందరినీ ఆకర్షించింది.

అయితే 1974లో ఇందిరాగాంధీ ప్రభుత్వం పోఖ్రాన్‌వద్ద అణువిస్ఫోటనం చేసి బాంబుల తయారీకి మనం కూడా రెడీ అని ప్రపంచానికి సంకేతం ఇచ్చింది. దానిని 'శాంతియుత అణువిస్ఫోటనం' అని అప్పటి నుండి ఇప్పటిదాకా మనం అంటూనే ఉన్నాముగానీ ప్రపంచంలో ఎవరూ నమ్మలేదు.

అమెరికాకు కోపం వచ్చింది. అప్పటిదాకా అణువిద్యుత్ ఉత్పత్తికి ఇస్తున్న సహకారాన్ని తాను బంద్ చేయడమేకాక మరొక 44 దేశాలు కూడా భారత్‌కు అణుఇంధనం (ప్రధానంగా యురేనియం) గానీ అణుసాంకేతిక పరికరాలూ ప్రక్రియలు గానీ ఎగుమతి చేయడానికి నిరాకరించేటట్టు చేయగలిగింది. భారతదేశ అణుసాంకేతిక పరిశ్రమ ఈ నిషేధం కింద నలిగిపోయిందని మన పాలకులు మనకు చెప్తూనే ఉన్నారు. అయినప్పటికీ వాజ్‌పేయి పాలనలో 1998లో పోఖ్రాన్‌లో మళ్ళీ విస్ఫోటనం చేయగలిగారు. ఎన్‌పిటి మీద సంతకం చేయడానికి మాత్రం మన పాలకులు నిరాకరిస్తూనే ఉన్నారు. 30 ఏళ్ళ నిషేధం నుంచి దేశాన్ని బయట పడేయడం కోసమే అమెరికాతో ద్వైపాక్షిక అణు ఒప్పందాన్ని భారత్ ఆహ్వానించిందనీ, సాధించిందనీ మన్మోహన్‌సింగ్ అంటున్నాడు. పూర్తిగా సాధించలేదనీ,

**కేవలం అణ్వస్త్ర దేశంగా గుర్తింపు పొందాలనేదే కాదు, అగ్రరాజ్యంగా గుర్తింపు పొందాలన్న కాంక్ష కూడా మన దేశ పాలకులను పట్టుకుంది. ఒక్క కాంగ్రెస్ పార్టీనే కాదు, భారతీయ జనతాపార్టీ వంటి ప్రధాన ప్రతిపక్ష పార్టీల్నే కాదు, ఆస్తులు, హోదా, పెద్ద పెద్ద చదువులు, సామాజిక జీవితంలో ప్రధానపాత్ర ఉన్న వారందరినీ పట్టుకుంది.**

అణుబాంబులు తయారు చేసుకునే స్వేచ్ఛను తాకట్టుపెట్టి అణు దిగుమతులు సాధించుకున్నామనీ భారతీయ జనతాపార్టీ వారూ, అనేకమంది అణు శాస్త్రవేత్తలూ అంటున్నారు. వామపక్షాల విమర్శలో ఈ ధ్వనికూడా కొంత ఉన్నప్పటికీ, అంతర్జా తీయ రాజకీయాలలో ప్రత్యేకించి ఇరాన్ విషయంలో అమెరికాకు ఏజెంటుగా మారే షరతు మీద అణునిషేధాన్ని ఎత్తివేయించుకున్నా మని వారు ప్రధానంగా విమర్శిస్తున్నారు. చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే బిజెపి వారి విమర్శకు జవాబుగా అణుబాంబులు పెద్దె త్తున తయారు చేసుకునే ఉద్దేశం మనకు లేదని మన్మోహన్‌సింగ్ అనడం లేదు. ఆ స్వేచ్ఛను పూర్తిగా వదులుకోలేదనీ, వదులుకున్నా మనడం అబద్ధమనీ అన్నాడు.

దీని భావం ఏమిటని మన దేశ రాజకీయ విశ్లేషకులెవరూ వ్యాఖ్యానించడం లేదుగానీ, పాకిస్తాన్‌కు చెందిన విశ్లేషకులంతా మొదటి రోజు నుండీ దీని భావాన్ని వేలెత్తి చూపుతున్నారు. అణుబాంబులు మరిన్ని తయారు చేసుకోవాలన్న కోరికే ఇండియాకు లేకపోతే భారత-అమెరికా అణు ఒప్పందాన్ని గురించి జరుగుతున్న సంవాదం ఈ రూపంలో ఉండేదా అని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రశ్న వేసుకోవడానికి మన పత్రికా వ్యాసకర్తలకు దేశభక్తి అడ్డంవచ్చి ఉండవచ్చును గానీ ఇది న్యాయమైన వ్యాఖ్య కాదనగలమా?

పోనీ ఈ ఒప్పందం ఆవశ్యకత ఏమిటని మన్మోహన్‌సింగ్ అంటున్నాడు? వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత్‌కు విద్యుత్తు అపారంగా కావాలట. పరిమితమైన పరిమాణంలో ఉన్న బొగ్గు, సహజ వాయువులపైన ఎక్కువ కాలం ఆధారపడలేమట. పైగా థర్మల్ విద్యుత్తుతో కాలుష్యం చాలావస్తుందట. జలవిద్యుత్తంటారా, దానికోసం ప్రాజెక్టులు కట్టాలి, ముంపు సమస్య చాలా ఉంటుం దట. వాటన్నిటికీ బదులు అణువిద్యుత్తు మీద ప్రధానంగా ఆధారపడడం సరైనదట. కొద్ది ఇంధనంతో చాలా విద్యుత్తు ఉత్పత్తి చేయవచ్చును, పైగా అణు విద్యుత్తు 'శుభ్ర'మైనది కూడా అంటున్నాడు. (అణువిద్యుత్తు 'క్లీన్' అన్న అభిప్రాయం విశేషంగా ప్రచారంలో ఉంది. అంటే అర్థం థర్మల్‌లాగ బూడిదను బయటకు వదలదని. కంటికి కనిపించని రేడియేషన్ విడుదల అవుతుంటుందని అందరికీ తెలిసినా అణువిద్యుత్తు 'శుభ్ర'మైనదనే ప్రచారం జరుగుతూనే ఉంటుంది).

ఈ లక్ష్యంతోనే అణునిషేధాన్ని ఎత్తివేయించుకొని విద్యుదుత్పత్తి అవసరాల కోసం అణుఇంధనం, సాంకేతిక పరికరాలు విరివిగా దిగుమతి చేసుకునే అవకాశం పొందామని ఆయన అంటున్నాడు. ఇది పచ్చి మోసం అని శాస్త్రవేత్తలు అనడమేకాక, ఈ మధ్యనే భారత ప్రణాళికా సంఘం స్వయంగా విడుదల చేసిన ఒక నివేదిక కూడా తెలుపుతున్నది. ప్రస్తుతం దేశంలో ఉత్పత్తి అవు తున్న మొత్తం విద్యుత్తులో అణువిద్యుత్తు 3 శాతం మాత్రమే కాగా దానిని ఎంత పెంచినా కనుచూపు మేరలో అది 7 శాతం దాట దనీ అత్యధికం 9 శాతం చేరుకోగలదనీ ఆ నివేదిక అంటుంది. పైగా అణువిద్యుత్తు ఖరీదెక్కువ. దేశీయ పరికరాలతోనే ఉత్పత్తి చేసినా అది థర్మల్ కంటే రెండు రెట్లు ఖరీదైనది. దిగుమతి చేసుకున్న పరికరాలతో ఉత్పత్తి చేసినట్టయితే మూడు రెట్లు ఎక్కువ అవుతుంది. (థర్మల్ విద్యుత్తు ఖరీదే జలవిద్యుత్తు ఖరీదు కంటే మూడు రెట్లు ఎక్కువని గుర్తుంచుకోవాలి).

కాబట్టి ఏ రకంగా చూసినా దేశ విద్యుత్ ఉత్పత్తిలో అణు విద్యుత్తు ప్రముఖపాత్ర వహించే అవకాశం లేదు. మరైతే ఇంత హడావుడి చేసింది ఎందుకు? అణ్వాయుధ సామర్థ్యాన్ని పెంచుకోవడమే అసలు లక్ష్యమా? అందుకేనా దానికి బ్రేకు పడిందా లేదా అన్నదే ప్రధాన చర్చ అయింది? దిగుమతి చేసుకున్న అణు ఇంధనమంతా అమెరికా కనుసన్నలలో విద్యుత్ అవసరాల కోసమే వాడు కుంటూ దేశీయ యురేనియం (కొంచెమే అయినా) మొత్తంగా బాంబుల తయారీ వైపు మళ్ళించే అవకాశం లేకపోలేదని 'దేశభక్తి' కరువైన కొద్దిమంది విశ్లేషకులలో ఒకడైన ప్రఫుల్ బిద్వాయి అననే అన్నాడు. ఈ ఒప్పందం ఫలితంగా భారత్‌కు అణ్వస్త్ర సామర్థ్యం ఉన్న దేశంగా గుర్తింపు లభించిందని మన్మోహన్‌సింగ్ అనడం, అమెరికా అటువంటి గుర్తింపేం ఇవ్వడం లేదని అతని విమర్శకులు అనడం, ఈ అనుమానానికి బలం చేకూరుస్తుంది.

కేవలం అణ్వస్త్ర దేశంగా గుర్తింపు పొందాలనేదే కాదు, అగ్రరాజ్యంగా గుర్తింపు పొందాలన్న కాంక్ష కూడా మన దేశ పాలకులను పట్టుకుంది. ఒక్క కాంగ్రెస్ పార్టీనే కాదు, భారతీయ జనతాపార్టీ వంటి ప్రధాన ప్రతిపక్ష పార్టీల్నే కాదు, ఆస్తులు, హోదా, పెద్ద పెద్ద చదువులు, సామాజిక జీవితంలో ప్రధానపాత్ర ఉన్న వారందరినీ పట్టుకుంది. అందుకే, ఐక్యరాజ్య సమితి నిర్మాణంలో భద్రతా మండలి అనేదొకటి ఉండడమే అసమతుల్యానికి కారణం అని ఒకనాడు అన్న వాళ్ళం, దాని బలాన్ని పెంచి మనకూ చోటు కల్పించాలని ఈ రోజు కోరుతున్నాం. వీటో అధికారం అప్రజాస్వామికం అని ఒకనాడు అన్నవాళ్ళం, ఇప్పుడు వీటో అధికారంతో సహా భద్రతా మండలిలో మనకు సభ్యత్వం కావాలంటున్నాం. పెద్ద సంఖ్యలో అణ్వాయుధాలున్న వారు వేరేవాళ్ళను అదుపుచేయడం అనైతికం అని ఒకనాడు అన్న వాళ్ళం, ఇరాన్‌ను సతాయించే అమెరికా ప్రయత్నంలో భాగం అయ్యాం. పదేపదే మీడియా – ముఖ్యంగా ఇంగ్లిష్ మీడియా – ఇండియా ఒక 'సూపర్ పవర్' అయిపోతున్నదని వ్యాఖ్యానించడం వింటున్నాం.

అగ్రరాజ్యం కావాలన్న కోరిక ఎప్పుడైనా అభ్యంతరకరమైనదే గానీ జనాభాలో సగం మందికి తిండిలేని దేశం ఆ హోదా కోసం ఉవ్విళ్లూరడం తుచ్ఛమైన కోరిక. కానీ భారత అమెరికా అణు ఒప్పందం వెనక ఉన్న కీలకమైన ప్రోద్బలం ఈ కాంక్షే. మనం ప్రధానంగా అభ్యంతరం చెప్పవలసింది దానికే.

చరిత్రలోకి కొంచెం వెనక్కిపోయి చూస్తే భారతదేశం అగ్రరాజ్యం కావాలన్న కోరిక 60 ఏళ్ళ కింద ఒక్క రాష్ట్రీయ స్వయం సేవక సంఘానికి (ఆర్ఎస్ఎస్) మాత్రమే ఉండింది. వేరే అందరూ, వారి వారి పద్ధతులలో, భారతదేశం ఒక న్యాయబద్ధమైన సమాజంగా రూపొందాలనే కోరుకున్నారు. కాంగ్రెస్ వారు, కమ్యూనిస్టులు, సోషలిస్టులు, సర్వోదయవాదులు, కులనిర్మూలన వాదులు అందరూ ఇటువైపే ఉన్నారు. రాజకీయ స్వాతంత్ర్యోద్యమంలోనూ, సామాజిక ఆర్థిక మార్పుకోసం కృషి చేసిన ఉద్యమాలలోనూ పాల్గొన్నది వీరే. వీరెవ్వరూ భారత్ అగ్రరాజ్యం కావాలని కోరుకోలేదు. ఏ ఉద్యమంలోనూ, ఏ సంస్కరణాత్మక కృషిలోనూ ఆర్ఎస్ఎస్ పాల్గొనక పోగా, హైందవ సమాజంలో సంస్కరణాత్మక కృషిని గట్టిగా వ్యతిరేకించింది. వారొక్కరే స్వాతంత్ర్యానంతరం భారత్ అగ్రరాజ్యం దిశగా పయనించాలని కోరుకున్నారు. దానికి తగిన రాజ్యాంగం రాసుకోలేదని నిందించారు.

ఈ గోల్వాల్కర్ భావజాలమే నేడు భారత పాలకవర్గాల ఉమ్మడి దృక్పథం అయింది. వామపక్ష పార్టీలు సైతం దీనిని ఏ మేరకు నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తున్నాయో తెలీదు. ఈ కీలకమైన విషయాన్ని దృష్టిలో ఉంచుకుంటే తప్ప అణు ఒప్పందానికి సంబంధించిన చర్చ మనకు సంపూర్ణంగా అర్థంకాదు.

అందుకే భారత్ అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం (ఎన్పిటి) పైన సంతకం చేసి, అంతర్జాతీయ నియమాల పరిధిలోకి వచ్చాము కాబట్టి మాపైన నిషేధం ఎత్తివేయమని అడిగే ప్రయత్నం చేయలేదు. అమెరికా అణుశక్తి చట్టంలోని సెక్షన్ 123 కింద అమెరికాతో ద్వైపాక్షిక ఒప్పందం చేసుకొని అమెరికా గొడుగు కింద అణ్వస్త్ర సామర్థ్యం గల దేశంగా గుర్తింపు పొంది తన అణుశక్తి ప్రయోజనాలను కాపాడుకోవాలని చూసింది. ఎన్.పి.టి ఎంత వివక్షా పూరితమైన ఒప్పందమైనా దానికి అంతర్జాతీయ స్వభావం ఉంది. దాని బదులు అమెరికాతో ద్వైపాక్షిక ఒప్పందం చేసుకుని తద్వారా అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఏఇఏ) పర్యవేక్షణను అంగీకరించి (అదనంగా అమెరికా పర్యవేక్షణను కూడా అంగీకరించి) దిగుమతుల పైన నిషేధాన్ని ఎత్తివేయించుకోవడం అంటే ప్రపంచంలోని ఏకైక అగ్రరాజ్యానికి భారత్‌ను ఉపగ్రహంగా ప్రకటించుకోవడమే తప్ప వేరే ఏమీకాదు. అంటే ఒప్పందం వివరాలలోకి పోనవసరం లేకుండానే, ఈ '123' మార్గాన్ని ఎంచుకోవడంలోనే అమెరికా నెరపుతున్న ప్రపంచాధిపత్యానికి భారత్ జేజేలు పలికి దాని నీడన తానూ చిన్నపాటి అగ్రరాజ్యంగా గుర్తింపు పొందాలని చేసిన ప్రయత్నాన్ని గుర్తించవచ్చు.

అమెరికా దీనిని ఆసరా చేసుకొని ఒక పక్క ద్వైపాక్షిక ఒప్పందం తీరుతెన్నుల గురించి చర్చలు జరుగుతుండగానే, ఆ తీరు తెన్నులను నిర్దేశించే హైడ్ చట్టాన్ని చేసింది. ప్రధానంగా, ఇరాన్ విషయంలో అమెరికా అనుసరిస్తున్న విధానాలకు భారత్ సహాయ సహకారాలు తప్పనిసరిగా ఉండాలన్న నియమం ఒప్పందంలో భాగంగా ఉండాలని చట్టం చేసి మరీ ఆదేశించింది. రెండు సార్వభౌమ దేశాల మధ్య ఒక విషయం పైన సమానతా ప్రాతిపదికన చర్చలు జరుగుతుండగా, ఆ చర్చలు ఏ విధంగా ఉండాలో నిర్దేశిస్తూ ఆ రెండింటిలో ఒక దేశం చట్టాన్ని చేయడాన్ని మామూలుగానైతే రెండవ దేశం చెంప దెబ్బగా భావిస్తుంది. మన వాళ్ళు ఆ చెంప తుడిచేసుకొని రెండవ చెంప చూపించారు.

భారత్ గొప్ప పట్టుదలతో చర్చలు జరిపి అద్భుతమైన ఒప్పందాన్ని సాధించుకుందన్న అభిప్రాయం కలిగించడానికి రెండు దేశాలూ కలిసి నాటకం ఆడాయని ఏ ప్రతిపక్ష నాయకుడో కాదు, ఒకప్పుడు భారత ప్రభుత్వానికి భద్రతా విషయంలో ఉపసలహా దారుగా ఉండిన సతీశ్‌చంద్ర స్వయంగా అన్నారు. నిషేధం ఎత్తివేసిన తరువాత భారత్ దిగుమతి చేసుకునే అణు ఇంధనాన్ని 'రీప్రాసెస్' చేసుకునే హక్కు ఇయ్యవలసిందేనని భారత్ పట్టుబట్టిందన్నారు. అణు ఇంధనాన్ని వాడినప్పుడు వెలువడే వ్యర్థ పదార్థంలో అణుధార్మిక శక్తి చాలా ఉంటుంది. దానిని మళ్ళీ మళ్ళీ ఇంధనంగా వాడుకునే ప్రక్రియను రీప్రాసెసింగ్ అంటారు. దీనివల్ల ఆ ఇంధనం నుండి వచ్చే శక్తిని 50 లేక 60 రెట్లు పెంచుకోవచ్చును. అయితే రీప్రాసెస్ చేసుకోనిస్తే ఆ విధంగా లభ్యమైన ఇంధనాన్ని భారత్ అణ్వస్త్రాల తయారీకోసం వాడుకుంటుందన్న భయాన్ని వ్యక్తంచేస్తూ అమెరికా ఈ హక్కును నిరాకరిస్తున్నదన్నారు. రెండవది ఏమిటంటే ఒక వేళ ఇండియా మరొకసారి అణు విస్ఫోటనానికి పాల్పడిందనో, ఇరాన్ పట్ల మెతకవైఖరి ప్రదర్శించిందనో, ఇతర విషయాలలో తన మాటకు కట్టుబడి లేదనో అమెరికా ఈ ఒప్పం దాన్ని రద్దుచేసుకుని తాను ఇచ్చిన అణు సాంకేతిక పరికరాలూ, ఇంధనమూ వెనక్కి ఇచ్చేయమని డిమాండ్ చేసినట్టయితే, అప్పటికి ఇండియా దిగుమతి చేసుకున్న అణు రియాక్టర్లకు ఇంధనం చివరి కంటా లభ్యమయ్యే మార్గాన్ని చూపాలని ఇండియా అంటోందని, అమెరికా దానికి సుముఖంగా లేదని.


**రెండు సార్వభౌమ దేశాల మధ్య ఒక విషయం పైన సమానతా ప్రాతిపదికన చర్చలు జరుగుతుండగా, ఆ చర్చలు ఏ విధంగా ఉండాలో నిర్దేశిస్తూ ఆ రెండింటిలో ఒక దేశం చట్టాన్ని చేయడాన్ని మామూలుగానైతే రెండవ దేశం చెంప దెబ్బగా భావిస్తుంది. మన వాళ్ళు ఆ చెంప తుడిచేసుకొని రెండవ చెంప చూపించారు.**

ఈ ఒప్పందం వల్ల మనం కోల్పోయేది కేవలం మన స్వాతంత్ర్యాన్నీ, సార్వభౌమత్వాన్నీ మాత్రమే కాదు. దేశం లోపలా బయటా న్యాయబద్ధమైన సామాజిక వ్యవస్థకోసం నిలబడాలనే తొలినాటి లక్ష్యాన్ని కోల్పోతాము. దాని స్థానంలో ఒక 'గ్లోబల్ పవర్' కావాలన్న లక్ష్యాన్ని స్వీకరించిన వాళ్ళ మవుతాము.

చివరికి ఒప్పందంలో రాసుకున్నదేమిటంటే ఐఎఏఇఏ పర్యవేక్షణ కింద 'రీప్రాసెసింగ్' హక్కును సూత్రప్రాయంగా అమెరికా అంగీకరించింది. కానీ దాని వివరాలు భారత్ కోరినప్పుడు నిర్ణయించుకోవలసి ఉంటుంది. ఒప్పందాన్ని అమెరికా రద్దుచేసుకుని తానిచ్చిన పరికరాలు, ఇంధనం వెనక్కి తీసుకుపోయినా కూడా అప్పటికి భారత్ దిగుమతి చేసుకున్న అణు రియాక్టర్లకు చివరిదాకా ఇంధనం లభ్యమయ్యే ఏర్పాటుకోసం కృషి చేయవలసి ఉంటుంది. ఇవి రెండూ అస్పష్టమైన హామీలే అయినప్పటికీ వీటికి అమెరికాను ఒప్పించడం ద్వారా ఇండియా గొప్ప విజయం సాధించిందన్న అభిప్రాయం దేశానికి కలిగించారు.

**చివరిగా,**

ఈ ఒప్పందం చేసుకోకపోతే ఇండియా ఏం కోల్పోయేది? విద్యుదుత్పత్తి కోసం అణు ఇంధనం, సాంకేతిక పరికరాలు దిగుమతి చేసుకునే హక్కును పునరుద్ధరించుకునే అవకాశాన్ని కోల్పోయేది. పైన చెప్పినట్టు, అధికార సమాచారం ప్రకారమే అణువిద్యుత్తు దేశ విద్యుత్ అవసరా లలో 7 శాతం, అత్యధికమంటే 9 శాతం, మించి తీర్చదు. పైగా దాని ఖరీదూ ఎక్కువ. అంతే కాక రేడియేషన్ వల్ల వచ్చే దీర్ఘకాలిక ప్రమాదమూ చిన్నదికాదు. అటువంటప్పుడు ఏం మహా కోల్పోయినట్టు? ఈ ఒప్పందం చేసుకోవడం వల్ల ఇండియా ఏం కోల్పోయింది? అణ్వాయుధాలు మరిన్ని తయారు చేసుకునే స్వేచ్ఛ కోల్పోయిందంటున్నారు. ఎందుకంటే ఒక్క విస్ఫోటనానికి పాల్పడినా అమెరికా ఈ ఒప్పందాన్ని రద్దు చేసుకొని ఇచ్చినవన్నీ వెనక్కి తీసుకొనిపోవచ్చు, మళ్ళీ నిషేధం పెట్టవచ్చు.




బాంబులు చేసుకోకపోతే ఏం పోయింది లెమ్మంటే మీకు దేశ భద్రత పట్టదా అంటారు. కానీ భారత్ బాంబులు తయారు చేసుకోకూడదని అమెరికా అనిందేగానీ భారత్ భద్రతను గాలికొదిలేస్తాననలేదు. అమెరికా ఈ రోజు భారత్‌ను ఒక ముస్లిమేతర రాజ్యంగా చూస్తూ ఉంది. 'ఇస్లామిస్టు తీవ్రవాదం' పైన తాను చేస్తున్న పోరాటంలో ఒక మిత్ర దేశంగా భావిస్తు న్నది. ఆ పాత్ర మన పాలకులకు అభ్యంతరకరంగా తోచకపోవడం సమస్యగానీ, ఆ పాత్రను అంగీకరించినట్టయితే భారత్ భద్రత కొచ్చిన సమస్యేమీ లేదు.

ఆ పాత్రలో భారత్ మరింత స్థిరపడడమే ఈ ఒప్పందం సారాంశం. దానివల్ల మనం కోల్పోయేది కేవలం మన స్వాతంత్ర్యాన్నీ, సార్వభౌమత్వాన్నీ మాత్రమే కాదు. దేశం లోపలా బయటా న్యాయబద్ధమైన సామాజిక వ్యవస్థకోసం నిలబడాలనే తొలినాటి లక్ష్యాన్ని కోల్పోతాము. దాని స్థానంలో ఒక 'గ్లోబల్ పవర్' కావాలన్న లక్ష్యాన్ని స్వీకరించిన వాళ్ళమవు తాము. గోల్వాల్కర్ శిష్యులివాళ కేవలం ప్రతిపక్షంలో ఉన్నందుకో లేక అణుబాంబులు మరిన్ని తయారు చేసుకోలేక పోతామన్న భయం వల్లనో ఈ ఒప్పందాన్ని వ్యతిరేకిస్తుండవచ్చును గానీ, ఇది నిజానికి వారి గురూజీ అజెండాయే. వారి సలహాదారులు వారికి సరైన సలహాలు ఇస్తున్నట్టు లేరుగానీ ఈ ఒప్పందం వల్ల భారత్ సైనిక రంగంలో అణుసాంకేతిక సామర్థ్యాన్ని కోల్పోకపోగా తెలివిగా వ్యవహరించినట్టయితే పెంచుకోగలదు. ఈ ఒప్పందం భారతదేశపు అణుశక్తి రంగాన్ని సైనిక రంగం, పౌరరంగం అని రెండుగా విభజిస్తుంది. ఒప్పందం యావత్తు పౌరరంగానికే వర్తిస్తుంది. రేపు ఇంధనం దిగుమతులు, సాంకేతిక దిగుమతులు జరగబోయేదీ పౌరరంగంలోనే. ఐఏఇఏ పర్యవేక్షణ, అమెరికా పర్యవేక్షణ ఉండబోయేది, పౌరరంగంపైనే. సైనిక రంగంలో ఏదీ ఉండదు. నిజమే, బాంబు విస్ఫోటనం జరిపినట్టయితే అమెరికా ఈ పౌర ఒడంబడికను రద్దుచేసుకోగలదు. అయితే ఆ ఒక్కటి చేయకపోతే, లేదా చేయవలసి వస్తే అది అనివార్యమయిందని అమెరికాను నయానో భయానో ఒప్పించినట్టయితే, ఇతర రూపాలలో అణుశక్తి ఆధారిత సైనిక వ్యవస్థను యదేచ్ఛగా అభివృద్ధి చేసుకోవచ్చు. పౌరరంగంలో దిగుమతి చేసుకున్న ఇంధనమే వాడుకున్నట్టయితే ఇవ్వాళ రెండు రంగాలలో వాడుతున్న దేశీయ యురేనియం ఇంధనం యావత్తు సైనిక రంగంలోనే వాడవచ్చు. మన వాళ్ళు దీన్ని చేయబోతారు కూడా అనడంలో సందేహం లేదు.

ఈ క్రమంలో 'ఇండియా' అనే భావనకు ఏం గతి పట్టిస్తున్నారన్నది మన సమస్య కావాలి. మానవత పునాదిగా గల నమూనా కోరుకుంటున్నామా లేక అధికారం పునాదిగా గల నమూనా కోరుకుంటున్నామా అని నిర్ణయించుకొని ఈ చర్చలో అందరం పాల్గొం దామని ఆహ్వానిస్తూ ...

**31.8.2007**
**హైదరాబాద్**

**మానవహక్కుల వేదిక**
(Human rights Forum) HRF